

అంబేద్కర్ సాక్షిగా..

ఐదేళ్ల అరాచకం

దళితులపై దాడులు.. దౌర్జన్యాలు.. వేధింపులు..



నా ఎస్సీలూ.. నా ఎస్టీలూ.. నా బీసీలూ.. నా మైనారిటీలూ.. అని ముఖం నిండా అమాయకత్వం నింపుకుని నమ్మబలికే నాయకుల మాటలన్నీ అబద్ధాలే! ఎన్నికల్లో ఓట్లు అవసరం అయినపుడూ, అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రాం వంటి మహనీయుల వర్ధంతి, జయంతి రోజుల్లో మాత్రమే ఎస్సీలు గుర్తుకొస్తారు. ఊపిరాడనంతగా విగ్రహాలను పూల దండలతో ముంచెత్తి, ఉపన్యాసాలతో ఊగిపోతారు. ఆ తర్వాత అణగారిన వర్గాలను గాలి కొదిలేస్తారు. అగ్రవర్ణ సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తారు. పేరుకు పదవులిచ్చి, అధికారం తమ దగ్గరే దాచుకుంటారు. అందుకు నిలువెత్తు నిదర్శనమే ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలన. జిల్లాలో దళితులను అవమానించి, దౌర్జన్యాలు చేసి, వారి భూములు లాక్కుని ఇప్పుడు మళ్లీ ఇంకో ఛాన్సు ఇవ్వండంటూ అడుగుతున్నారు.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఇచ్చిందెంత.. లాక్కున్నదెంత?

నవరత్నాల నిధులు ఇచ్చి దళితుల జీవితాలు మార్చేశాం అంటూ వైసీపీ గొప్పలు చెప్పుకుంటోంది. నిజానికి బటన్ నొక్కి చేసిన సాయంకన్నా దొంగ దారుల్లో వారి నుంచి లాక్కున్నదే ఎక్కువ. ఐదేళ్ల కిందట నెలకు కరెంటు బిల్లు ఎంత వచ్చేది.. ఇప్పుడు ఎన్ని రెట్లు పెరిగింది అని పోల్చుకుంటే చాలు అమ్మ జగనా! అనకుండా ఉండలేరు. సంపూర్ణంగా మద్యం నిషేధించిన తర్వాతే మీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతా అని ప్రకటించిన జగన్ జె బ్రాండ్ చీప్ లిక్కర్‌ను ముంచెత్తి దండుకుంటున్నారు. పేద దళిత కుటుంబాల్లో సంపాదన అంతా మగవాళ్ల మద్యానికే సమర్పించుకోవాల్సి వస్తోంది. పెట్రోలు మొదలు ఉప్పూ, పప్పూ సహా ధరలన్నీ పెరిగిపోయి కుటుంబాలు గుల్లవుతున్నాయి. మరి దళితులకు జగన్ చేసింది మేలా, కీడా.. అని గత ఎన్నికల్లో ఓట్లేసిన దళిత కటుంబాలు చర్చించుకుంటున్నాయి.



నాడు భూ ఆక్రమణను అడ్డుకున్న దళితులపై దాడి చేస్తున్న వైసీపీ నేతలు

ఓంప్రతాప్.. చనిపోయాడు

మదనపల్లెలో నాణ్యతలేని మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ సీఎం జగన్‌ను తీవ్రస్థాయిలో దూషిస్తూ సోమల మండలం కందూరుకు చెందిన వైసీపీ దళిత కార్యకర్త ఓంప్రతాప్ 2020 ఆగస్టు 25న సెల్ఫీ వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియో బాగా వైరల్ అయింది. మరుసటి రోజే ఓం ప్రతాప్ చనిపోయాడు. వైసీపీ వాళ్లే హత్య చేశారని, రీపోస్టు మార్టం చేయాలని ప్రతిపక్షాలు డిమాండు చేశాయి. మృతుడి గ్రామానికి వీరిని వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. చివరికి.. అనారోగ్యంతో మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు చెప్పారు. ఇప్పటికీ ఓంప్రతాప్‌ను వైసీపీ వాళ్లే హత్య చేశారని ప్రతిపక్షాలు చెప్తున్నాయి.

నోట్లో గుడ్డ కుక్కి.. కాళ్లు చేతులు కట్టేసి..

గతేడాది ఆగస్టులో జరిగిన పుంగనూరు రణరంగం ఘటనకు సంబంధించి పులిచెర్లకు చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణను అప్పటి కల్లూరు సీఐ శ్రీనివాసులు నవంబరు 3న హైదరాబాదులో అరెస్టు చేశారు. కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కాళ్లు చేతులు కట్టేసి, నోట్లో గుడ్డ కుక్కి దారుణంగా కొట్టారు. కొట్టేటప్పుడు సీఐ వీడియో కాల్ చేసి ఓ వైసీపీ నేతకు చూపించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. మంత్రి పెద్దిరెడ్డిపై సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్న కారణంగా పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేందుకు ప్రయత్నించినట్లు అతడు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.

అంబేద్కర్ జయంతి రోజున ఫ్లెక్సీలు కట్టొద్దంటూ..

పుంగనూరులో గతేడాది అంబేద్కర్ జయంతి సందర్భంగా బీసీవై పార్టీకి చెందిన ఎస్సీ నేత ఆనంద్ ఫ్లెక్సీలు కడుతుండగా అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. ఆనంద్‌తో పాటు మరికొందరిని తిట్టి స్టేషన్‌కు తీసుకెళ్లి.. తర్వాత వదిలిపెట్టారు. ఈ విషయంగా మానవ హక్కుల సంఘం, గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.

దళితుల భూమి ఆక్రమణకు యత్నం

చౌడేపల్లె మండలం బోయకొండలోని భవానీనగర్‌లో దళితులైన శ్రీనివాసులు, రమణమ్మ దంపతులు ఎకరా డీకేటీ పొలాన్ని సాగుచేసుకుంటున్నారు. వీరి పక్క పొలానికి చెందిన కృష్ణమూర్తి కుమారులు దీనిని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. వీరికి స్థానిక వైసీపీ నాయకులు గంగిరెడ్డి, మోహన, రెడ్డప్ప, మంజునాథ, చరణ్‌కుమార్, గంగాధర్, మల్లికార్జున, సుబ్బు, బన్ని మద్దతుగా వచ్చారు. 'మమ్మల్ని లాగి పడేసి కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. మనవరాలు సమీరతో పాటు మహిళలపైనా దాడి చేశారు. వికలాంగైన అల్లుడు నాగేంద్ర వేలు విరిచారు' అని అప్పట్లో శ్రీనివాసులు కుటుంబీకులు పోలీసుల ఎదుట వాపోయారు.

వేధింపులు భరించలేక ఆత్మహత్య

పలమనేరు మండలం గజ్జలవారిపల్లెకు చెందిన ఎస్సీ యువకుడు ధ్యానాది సురేష్.. ఓ కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు. యజమాని వేధింపులు భరించలేక 2020 ఆగస్టులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

బాలికపై అత్యాచారం

పలమనేరు మండలంలోని 14 ఏళ్ల బాలికపై రెండేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ యువకుడు అత్యాచారం చేశాడు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడ్ని అరెస్టు చేశారు.

గ్రామంలోకి రానీయకుండా..

చౌడేపల్లె మండలం ఓదులపేటకు చెందిన టీడీపీ ఎస్సీ కార్యకర్త రెడ్డప్ప స్థానికంగా ఓట్లను ప్రభావితం చేసే స్థాయి ఉన్న వ్యక్తి. దీంతో వైసీపీ వాళ్లు ఇతడిపై తరచూ తప్పుడు కేసులు పెట్టి గ్రామంలోకి రాకుండా బెదిరిస్తున్నారు. దీంతో అతడు తిరుపతిలో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ తల దాచుకుంటున్నాడు. చౌడేపల్లెలో ఆదివారం బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు ఆయన ఎస్పీ అనుమతి కోరుతున్నారు. మరి రానిస్తారా.. లేదా చూడాలి.



డిప్యూటీ సీఎంను రానీయకుండా గుంటిపల్లిలో రోడ్డు మీద వేసిన ముళ్ల కంపలు

డిప్యూటీ సీఎం.. మా ఊరికి రావొద్దు

సొంత పార్టీ ఎస్సీ నేతలకు కూడా వైసీపీలో విలువ లేకుండా పోయింది. పెనుమూరు మండలం గుంటిపల్లెకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి రాకూడదంటూ గతేడాది ఆ పార్టీ వారే రోడ్డుకు అడ్డంగా ముళ్లకంప వేశారు. ఎంపీపీ హేమలత సురేష్‌రెడ్డి వర్గం ఈ చర్యకు పాల్పడింది. పోలీసులు వెళ్లి ముళ్లకంపలు తొలగించి గ్రామంలో పర్యటన పూర్తి చేయించారు. ముళ్ల కంపలు వేయించిన సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డికి సమీప బంధువు.

మీ బిడ్డలైతే ఇక్కడ చదువుతారా జగన్?





శాంతిపురం మండలం రాళ్లబుదుగూరు ఎస్సీ హాస్టల్ దుస్థితి - బంగారుపాళ్యం ఎస్టీ హాస్టల్‌లో రెక్కలు విరిగిన ఫ్యాను

చదువుల గురించి జగన్ చెప్పుకునే గొప్పల అసలు రంగు సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను పరిశీలిస్తే అర్థం అవుతుంది. దళిత బిడ్డలు చదువుకునే తావుల్లో కనీస వసతులులేవు. నిర్లక్ష్యానికి సాక్ష్యంగా ఇవి దర్శనమిస్తున్నాయి.

- కుప్పంలోని మునస్వామిపురంలో 30 సంవత్సరాల కిందట కట్టిన హాస్టల్ భవనం స్లాబు పెచ్చులూడి పడిపోతోంది. ఎప్పుడు ఏ పెచ్చు పడుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు పూర్తిగా పాడైపోవడంతో బహిర్భూమికి బయటకు వెళుతున్నారు.
- శాంతిపురం మండలం దండికుప్పం హాస్టల్‌లో 40 మంది, రాళ్లబూదుగూరులో 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ రెండు హాస్టల్ భవనాలు శిథిలావస్థలకు చేరుకున్నాయి. రాళ్లబూదుగూరు హాస్టల్‌లో డైనింగ్ హాల్, వంటగది పాడైపోవడంతో మూతపడింది.
- నగరి పట్టణం చింతలపట్టెడలో అద్దె భవనంలో ఉన్న హాస్టల్ కిటికీలు, తలుపులు సరిగాలేవు.
- బంగారుపాళ్యంలో ఎస్టీ హాస్టల్‌లో పైకప్పు పెచ్చులూడిపోయింది.ఫ్యాన్ల రెక్కలు విరిగిపోవడంతో అవి తిరగడం లేదు. మరుగుదొడ్ల తలుపులు విరిపోయాయి.
- పూతలపట్టులో రెండు ఎస్సీ హాస్టళ్ల భవనాలు శిథిలావస్తకు చేరుకున్నాయి. బహిర్భూమికి విద్యార్థులు బయటకు వెళుతుండటంతో పాటు బయటి నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు.

రాయితీ రుణం.. ఇచ్చుంటే ఒట్టు

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒకరికి కూడా రాయితీ రుణాలను మంజూరు చేయలేదు. 2014-19లో టీడీపీ అధికారంలో ఉండగా రూ.లక్ష నుంచి రూ.25 లక్షల వరకు.. ప్రొవిజన్ షాపు నుంచి టాప్ ఎండ్ ఇన్నోవా కార్ల వరకు దళితులకు రుణాలు ఇచ్చారు. ఇలా.. ఉమ్మడి జిల్లా పరిధిలో 6వేల మందికి రుణాలిచ్చారు. అందులో రూ.500 కోట్ల బ్యాంకు రుణంకాగా మరో రూ.500 కోట్లను సబ్సిడీగా అందించారు. వైసీపీ హయాంలో ఒకరికీ రుణం ఇవ్వకపోగా.. గత ప్రభుత్వంలో ఇచ్చిన రుణాలను రికవరీ చేసి ఉద్యోగులు జీతాలను తీసుకుంటున్నారు.

ఒక్కరికే విదేశీ విద్య

టీడీపీ అమలు చేస్తున్న 'అంబేడ్కర్ విదేశీ విద్య' పథకాన్ని వైసీపీ పక్కన పెట్టింది. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత 'జగనన్న విదేశీ దీవెన' పేరిట ప్రారంభించింది. ఈ రెండేళ్లలో జిల్లా నుంచి ఒక ఎస్సీ విద్యార్థినే విదేశాలకు పంపించారు. టీడీపీ హయాంలో 50 మందిని పంపారు. ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున టీడీపీ ప్రభుత్వం అందించింది. ఇప్పుడు వాళ్లంతా చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కాగా, ఈ పథకానికి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరు మార్చి.. జగన్ పేరు పెట్టడంపై అప్పట్లో దళిత సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేశాయి.

అంబేద్కర్ విగ్రహానికి పోటీగా..

రామకుప్పంలోని రెడ్డివీధి కూడలిలో నాలుగేళ్ల కిందట శివాజీ నగర్ వాసులు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. పక్కనే రెడ్డివాసులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ శిలాఫలకాన్ని ఏర్పాటుచేశారు. ఇరువర్గాల మధ్య వివాదం ముసురుకోవడంతో నాలుగేళ్లుగా పోలీస్ పికెట్ కొనసాగుతోంది. అంబేడ్కర్ జయంతి, వర్ధంతి రోజుల్లో విగ్రహానికి సాంఘిక సంక్షేమ అధికారులు నివాళులర్పిస్తున్నారే తప్ప స్థానికులకు అవకాశం ఇవ్వడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి అధికార పార్టీ చొరవ చూపలేదు.



అంబేడ్కర్ విగ్రహం పక్కనే ఉయ్యాలవాడ విగ్రహ ఏర్పాటుకు శిలాఫలకం

ఎంఎస్ బాబును వాడుకుని వదిలేశారు

పూతలపట్టు నుంచీ గత ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసి ఎంఎస్ బాబు గెలిచారు. ఆ ఎన్నికల్లో పోలింగ్ రోజున ప్రత్యర్థి పార్టీకి కంచుకోట వంటి గ్రామానికి వెళ్లి ఏకపక్ష పోలింగ్‌ను అడ్డుకునేందుకు యత్నించారు. గ్రామస్తుల దాడిలో తీవ్రంగా గాయపడి, దాదాపు చావు అంచుల దాకా వెళ్లివచ్చారు. అయినా ఎంఎస్ బాబుకు ఈ ఎన్నికల్లో వైసీపీ మొండిచేయి చూపింది. తనకు టికెట్ రాకుండా అడ్డుపడింది మంత్రి పెద్దిరెడ్డేనంటూ ఆయన ఆరోపించిన వెంటనే బెదిరింపులకు దిగారు. ఇపుడాయన కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు.

నాడు.. సునీల్‌కూ పరాభవమే

ఇప్పుడు పూతలపట్టు వైసీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కూ 2019లో ఆ పార్టీలో తీవ్ర పరాభవం ఎదురైంది. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ఆయన పార్టీ అధినేత జగన్‌ను కలిసేందుకు హైదరాబాదు వెళ్లారు. సీఎం ఇంటి గేటు వద్దే సునీల్ దంపతులు రోజంతా నిలబడినా ఎవరూ పలకరించలేదు.

నారాయణస్వామి, రెడ్డెప్పతో బంతాట

సర్వే రిపోర్టు పేరిట కొందరు దళిత ఎమ్మెల్యే, ఎంపీలను వైసీపీ అధిష్టానం బంతాట ఆడుకుంది. తొలుత నారాయణస్వామికి టికెట్ నిరాకరించారు. అవమానం భరించలేనంటూ అధినేతను బతిమలాడడంతో చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆదేశించారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. కొన్నాళ్లకు మళ్లీ నారాయణస్వామిని తిరిగి జీడీనెల్లూరు.. రెడ్డెప్పను చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. మళ్లీ కొన్ని రోజులకు నారాయణస్వామిని పక్కన పెట్టి ఆయన కుమార్తె కృపాలక్ష్మిని అభ్యర్థిగా ప్రకటించారు. ఇలా వీరిద్దరితో బంతాట ఆడుకున్నారు. ఇక రెడ్డి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులెవరినీ మార్చకపోవడం గమనార్హం. చిత్తూరులో అదనంగా మరొకరికి అవకాశం ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో 8 మంది ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే.

'వైసీపీ' తీరు మారలేదు

- **నూలుకుంటలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నాలు**
- **ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన స్థానికులు**

కుప్పం, ఏప్రిల్ 13: ఒకవైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కనీసం జాతరలు, ఊరేగింపులు వంటివాటి నిర్వహణకు కూడా ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయినా వైసీపీ వారి తీరు మారలేదు. ఏకంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నాలు చేసేస్తున్నారు. దళితుల ఓట్లను ఆకర్షించడానికి దొడ్డిదారులు వెదుకుతున్నారు. కుప్పం మండలం నూలుకుంట గ్రామంలో శనివారం ఉదయం నుంచే సిమెంటు దిమ్మెను కొంతమంది నిర్మించడం ప్రారంభించారు. మధ్యాహ్నానికి నిర్మాణం పూర్తయ్యింది. ఇది ఎందుకని కొందరు గ్రామస్తులు ఆరా తీస్తే.. అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠకోసం వైసీపీ నేతలు కొందరు ఈ సిమెంటు దిమ్మెను నిర్మిస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల్ కోడ్ అమల్లో ఉండగా విగ్రహాలను ఎలా ప్రతిష్ఠిస్తారని వారు అభ్యంతరం తెలిపినా నిర్మాణం ఆగలేదు. దీనిపై వారు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై రిటర్నింగ్ అధికారిని వివరణ కోరగా, నూలుకుంటలో విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు తమకు కూడా అందిందని చెప్పారు. అలా చేయడం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



నూలుకుంటలో నిర్మిస్తున్న సిమెంటు దిమ్మె

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కు ప్రత్యేక నోటిఫికేషన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 13: పోస్టల్ బ్యాలెట్ కోసం ఫాం 12 అందించేందుకు ఎలాంటి గడువు విధించలేదని కలెక్టర్ షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ విషయంగా ఉద్యోగులు ఎలాంటి గందరగోళానికి గురి కావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు పోలింగ్ తేదీని నిర్ణయించి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఈ నెల 15వ తేదీన ఫాం 12ను ఆయా తహసీల్దార్లకు అందించాలని సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు వైరల్ అవుతున్నాయి. దీనికి సంబంధించి స్పష్టత ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గంటా మోహన్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల విభాగాన్ని సందర్శించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ విషయంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఫాం 12 విషయంగా స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు సమర్పణకు ఎలాంటి గడువు నిర్దేశించలేదని తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో సంబంధిత విధివిధానాలను అధికారికంగా విడుదల చేస్తామన్నారు.

రేపు జిల్లాలో షర్మిల పర్యటన

చిత్తూరు రూరల్/గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13: జిల్లాలో సోమవారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటించనున్నారు. ఉదయం 10.30 కార్వేటినగరంలో రోడ్‌షో, సమావేశం, 11.30 గంటలకు జడీ నెల్లూరులో, సాయంత్రం 5 గంటలకు పలమనేరులో, రాత్రి 7 గంటలకు బంగారుపాళ్యంలో రోడ్‌షో, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహిస్తారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. కార్వేటినగరంలో షర్మిల పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం మేనల్లుడు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు పిలుపునిచ్చారు.

టీడీపీ, వైసీపీ వర్గీయులపై కేసు నమోదు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 13: శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిలో గొడవకు సంబంధించి టీడీపీ, వైసీపీ వర్గీయులపై కేసులు నమోదయ్యాయి. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త హర్షవర్ధన్‌రెడ్డిపై.. చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి డ్రైవరు సైకిలా కుమారుడు బానేష్, అతడి వర్గీయులు కలసి శుక్రవారం దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తమను కులం పేరుతో దూషించారని రివర్స్‌లో ధర్నాకూ దిగారు. పరస్పర ఫిర్యాదులపై కేసులను నమోదు చేసినట్లు ఎస్‌ఐ కుళాయప్ప తెలిపారు.

టీడీపీ శ్రేణులపై అట్రాసిటీ కేసు: వైసీపీకి చెందిన ధనుష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ శ్రేణులు హర్షవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మునికన్నారెడ్డి, సూరిరెడ్డి, నవీన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు 324, 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

వైసీపీ శ్రేణులపై..: టీడీపీ కార్యకర్త హర్షవర్ధన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. వైసీపీ శ్రేణులు సాము, సురేష్, ధనూష్, ధరణి, మోహన్, బానేష్, మణి తదితరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

చల్లావారిపల్లె ఎఫ్‌ఏపై టీడీపీ నేత ఫిర్యాదు



బ్యానర్‌లో ఎఫ్‌ఏ ఫొటో



సమావేశంలో పాల్గొన్న వెంకటరమణ

కల్లూరు, ఏప్రిల్ 13: పులిచెర్ల మండలం చల్లావారిపల్లె పంచాయతీ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు (ఎఫ్ఏ) వెంకటరమణ ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మండలంలో శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వెంకటరమణ పాల్గొన్నాడని, ఓటర్లను ప్రభావితం చేసేలా ఫొటోలు, వీడియోలు ఉన్నాయంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. దీనిపై సోమవారం క్షేత్ర సహాయకుడిని విచారించనున్నట్లు ఎంపీడీవో తెలియజేశారు.

బీసీవైపీ వాహనాల ధ్వంసంపై కేసు నమోదు

పుంగనూరు, ఏప్రిల్ 13: సదుం మండలంలోని చిలకపాటివారిపల్లెలో శుక్రవారం రాత్రి జరిగిన బీసీవైపీ ప్రచార వాహనాల ధ్వంసంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతి తెలిపారు. బీసీవైపీ ప్రచార వాహనాలు గ్రామంలోకి రావద్దు అంటూ వాటిపై కర్రలతో దాడి చేసిన హరినాథ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జనసేనానిని కలిసిన దగ్గుమళ్ల



పవన్‌తో చిత్తూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 13: చిత్తూరు పార్లమెంటు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు శనివారం తిరుపతిలో జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. చిత్తూరు పార్లమెంటు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించుకోవాలని ప్రజలకు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఆయన నిత్యం అందుబాటులో ఉండి పార్లమెంటు అభివృద్ధికి కృషిచేస్తారని చెప్పారు. చిత్తశుద్ధితో పనిచేస్తారని పేర్కొన్నారు.

టీడీపీ కూటమితోనే అభివృద్ధి

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శనివారం చిత్తూరులో ఆయన జీడీ నెల్లూరు ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. చంద్రబాబు ఆదేశాలమేరకు అందరం కలసికట్టుగా పనిచేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సూపర్ సిక్స్. మ్యానిఫెస్టోలోని పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. నేతలు రుద్రయ్య నాయుడు, లోకనాథ నాయుడు, కార్జాల అరుణ, ఇందరమ్మ, జయశంకర్ నాయుడు, రాజేంద్ర, చెంగల్రాయ యాదవ్, స్వామిదాసు, రాజశేకర్, రెడ్డెప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్తూరుకు వంగవీటి రాధా

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 13: చిత్తూరులో ఆదివారం నిర్వహించే బలిజల ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర కాపుసంఘం నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా రానున్నారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెస్సార్ సర్కిల్‌లోని నాగయ్య కళాక్షేత్రం నుంచి అంబేడ్కర్ సర్కిల్, చర్చివీధి, పూలే విగ్రహం, ఆర్టీసీ బస్టాండు, కొంగారెడ్డిపల్లె మీదుగా ఎస్టేట్‌లోని ఆర్ఎల్ కల్యాణ మండపం వరకు ద్విచక్రవాహన ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను బలపరచాలనే అంశంపై సమావేశం నిర్వహిస్తారు.

ఈవ్‌టీజింగ్‌పై ప్రశ్నిస్తే ఆకతాయిల దాడులు

- పోలీసుల రక్షణ కోరితే కించపరిచేలా మాట్లాడారని తల్లిదండ్రుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న కుబేంద్ర, బుజ్జి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 13: తమ కుమార్తెలను వేధిస్తున్న ఆకతాయిలను ప్రశ్నిస్తే దాడి చేశారని యాదమరి మండలం వెంకటాపురానికి చెందిన కుబేంద్ర, బుజ్జి దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం వీరు మాట్లాడారు. 'మాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిత్తూరులోని ప్రైవేట్ ఆస్పత్రి.. వస్త్ర దుకాణంలో పనులను ముగించుకుని వీరు యాదమరికి వస్తారు. ఈ క్రమంలో మా గ్రామానికి చెందిన శ్రీనివాసులు, చిట్టిబాబు, కిషోర్, గోపి, మధు, సురేష్ మరికొందరు ఆకతాయిలు వారిని ఈవ్ టీజింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రశ్నించినందుకు వాళ్లు శుక్రవారం మా ఇంటికి వచ్చి దుర్భాషలాడి.. దౌర్జన్యం చేశారు. మారణాయుధాలతో విచక్షణారహితంగా భౌతిక దాడి చేశారు. కుబేంద్ర, అతడి కుమారుడు, కుమార్తెకు గాయాలయ్యాయి. దీనిపై యాదమరి పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకుండా కించపరిచేలా మాట్లాడారు. ఆకతాయిల వల్ల మా కుటుంబానికి ప్రాణ హాని ఉంది. ఎస్పీ స్పందించి ఆకతాయిల నుంచి మా కుటుంబానికి రక్షణ కల్పించాలి' అని వారు కోరారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శనివారం భక్తుల రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచి స్వామి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేయడంతో క్యూలైన్లు పూర్తిగా నిండి పోయాయి.

'హైస్కూల్ ప్లస్' అన్నారు. ఉన్నత పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. దీనిని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులుగా చెప్పుకొన్నారు. బోధకుల నుంచి సౌకర్యాల కల్పన వరకు నిర్లక్ష్యం చూపారు. ఫలితం చాలా వాటిల్లో అడ్మిషన్లే జరగలేదు. తాజా ఇంటర్ ఫలితాల్లో ఈ ఉన్నత పాఠశాలలు అట్టడుగున నిలిచాయి. 'హైస్కూల్ ప్లస్ కాదు.. మైనస్'గా మారాయి.

\- చిత్తూరు (సెంట్రల్)

'హైస్కూల్ ప్లస్' కాదు.. మైనస్

- ఇంటర్ ఫలితాల్లో అట్టడుగున
- పలుచోట్ల సున్నా శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండేళ్లకే తుస్సుమన్న వైనం



వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో హైస్కూల్ ప్లస్ ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాల

జిల్లాలోని 20 ఉన్నత పాఠశాలల్లో 2022-23 విద్యాసంవత్సరంలో 'హైస్కూల్ ప్లస్' ప్రారంభించారు. మూడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఈ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించారు. ఉన్నత పాఠశాల వరకు విద్యార్థుల సంఖ్య బాగున్నా.. హైస్కూల్ ప్లస్‌లో చేరడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈ హైస్కూల్ ప్లస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు.. ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున ఏటా 120 మంది విద్యార్థులు, రెండేళ్లకు 240 మంది ఉండాలి. ఈ లెక్కన 20 ఉన్నత పాఠశాలల్లో రెండేళ్ల కాలంలో 4800 మంది విద్యార్థులు ఉండాలి. కానీ ఉండేది 606 మందే. తొలి విద్యా సంవత్సరంలో 406 మంది చేరగా.. 2023-24లో ఆ సంఖ్య 200 మాత్రమే.

ఒక్కరూ చేరలేదు

పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు ఒక్క అడ్మిషన్ కూడా జరగలేదు. బంగారుపాళ్యం, జీడీ నెల్లూరు, కార్వేటినగరం, పెద్దపంజాణి, సదుం, తవణంపల్లె, వెదురుకుప్పం మండలాల్లోని హైస్కూల్ ప్లస్‌లో ఈ ఏడాది ఎవరూ చేరలేదు.

అధ్యాపకులు అంతంతమాత్రమే

ఆయా గ్రూపుల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా అధ్యాపకులను నియమించాలి. కానీ, పలు గ్రూపుల్లో విద్యార్థులు లేకపోవడంతో అధ్యాపకుల నియామకం కూడా అంతంత మాత్రంగానే ఉంది. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ ఇలా సబ్జెక్టుల వారీగా ఒక్కో పాఠశాలలో 10 మంది చొప్పున జిల్లాలో 200 మంది అధ్యాపకులు ఉండాలి. కానీ, 124 మంది అధ్యాపకులను నియమించారు. ఉగ్రాణంపల్లిలో ఒక్క విద్యార్థి కూడా లేకపోవడంతో నియామకం చేపట్టలేదు

ఉచితాలు లేనట్లే..!

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అన్ని ఉచిత సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. హైస్కూల్ ప్లస్‌లోని విద్యార్థులకు ఆ ఉచితాలు ఎత్తి వేసింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెండేళ్లుగా ఉచిత పాఠ్యపుస్తకాలు అందించలేదు. నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకం ఊసే లేదు.

ఔను.. అక్కడ బైపీసీలో అందరూ ఫెయిల్!

వెదురుకుప్పం, ఏప్రిల్ 13: ఔను అక్కడ బైపీసీ గ్రూపులో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్ష రాసిన విద్యార్థులందరూ ఫెయిలయ్యారు. శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో వెల్లడయ్యాయి. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను వైసీపీ ప్రభుత్వ హయంలో హైస్కూల్ ప్లస్ కాలేజీగా మార్చారు. కానీ, ఫలితాలు మాత్రం అక్కడ దారుణంగా ఉంది. విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువ కాదండోయ్.

ఫలితాలపై దారుణ ప్రభావం

- ఎస్ఆర్ పురం మండలం 49 కొత్తపల్లిమిట్టలోని హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో 16 మందికి ముగ్గురే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో బైపీసీలో ముగ్గురికి ఒకరే పాసయ్యారు. ఈ పాఠశాలలో మ్యాథ్స్ సబ్జెక్టుకు అధ్యాపకులు లేరు.
- నింద్రలో సెకండియర్ ఇంటర్‌లో 26 మందికి గాను ఇద్దరు మాత్రమే పాసయ్యారు.
- పాలసముద్రం మండలం ఎస్ఆర్ కండ్రిగ హైస్కూల్‌లో ఫస్టియరులో 9 మందికి గాను ఐదుగురు.. సెకండియర్‌లో 14 మందికి గాను ముగ్గురు ఉత్తీర్ణులయ్యారు.
- చౌడేపల్లె మండలం జడ్పీ బాలికల జూనియర్‌లోని హైస్కూల్ ప్లస్‌లో.. ఫస్టియర్ ఎంపీసీలో 12 మందికి గాను 9 మంది.. సీఈసీలో 10 మందికి గాను ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు.
- పులిచెర్ల మండలం కల్లూరులో సెకండియర్ ఎంపీసీలో 8 మందికి నలుగురు.. కార్వేటినగరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఫస్టియర్ బైపీసీలో 16 మందికి ఏడుగురు.. సీఈసీలో 19 మందికి ముగ్గురు పాసయ్యారు.
- విజయపురం మండలంలో ఫస్టియర్‌లో 18 మంది.. సెకండియర్ ఇంటర్‌లో 21 మంది ఉండగా.. ఏడాదికి ఇద్దరు చొప్పున నలుగురే ఉత్తీర్ణులయ్యారు. బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచిలో ఫస్టియర్ బైపీసీలో పది మంది, సీఈసీలో ఎనిమిది మంది చదువుతుండగా.. గ్రూపునకు ఒకరు చొప్పున ఇద్దరే పాసయ్యారు.

అక్కడ సున్నా ఫలితాలు

- సోమలలో ఫస్టియర్ ఇంటర్‌లో ఆరుగురు, సెకండియర్ ఇంటర్‌లో ఏడుగురు బాలికలు ఉండగా.. వీరంతా ఫెయిలయ్యారు. సున్నా ఫలితాలు వచ్చాయి.
- పులిచెర్ల మండలం కల్లూరులో ఫస్టియర్ బైపీసీలో పది మంది, ఎంపీసీలో ఆరుగురు, సెకండియర్ బైపీసీలో ఆరుగురు కలిపి 26 మందీ ఫెయిలయ్యారు.
- నింద్రలో ఫస్టియర్ ఇంటర్‌లో ఉన్న 18 మందీ ఫెయిలయ్యారు.

ఆ పాఠశాలలు పనిచేయాలి

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 13: టెన్త్ పరీక్షల కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు ఆదివారం రోజుల్లో తప్పనిసరిగా పనిచేయాలని డీఈవో దేవరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా పాఠశాల పదో తరగతి పరీక్ష జరిగిన దినాల్లో మధ్యాహ్నం పనిచేసి, 220 పనిదినాలు ఉన్నచో అలాంటి పాఠశాలలు ఆదివారం పనిచేయవలసిన అవసరం లేదని డీఈవో ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం అందించా

- టీడీపీ అధికారంలోకి వచ్చాక మరింత ప్రోత్సహిస్తాం
- మాజీ మంత్రి అమరనాథరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 13: పలమనేరు ప్రాంత యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల స్థాపనకోసం పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తనవంతు సహకారాన్ని అందించానని అమరనాథరెడ్డి తెలిపారు. పలమనేరు సమీపంలోని పారిశ్రామిక వాడలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సులభ, సరళతరమైన పారిశ్రామిక విధానాలు.. అప్పట్లో ఏర్పాటుచేసిన పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తలకు ఆనాడు తాను కల్పించిన సౌకర్యాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవేత్తలను మరింత ప్రోత్సహించేలా విధానాలు ఉంటాయని స్పష్టం చేశారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ యూనియన్ నాయకులు రాజా, అమరనాథరెడ్డి, జగదీష్, శ్రీనివాసులు, సంతోష్, మాబాషా, హేమంత్‌నాయుడు, సుబ్బు, టీడీపీ నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్పీసీ కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.





తుంబపాళ్యం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్రీడాసామగ్రిని అందజేస్తున్న ఎన్‌పీ ఇషిక, నివేదిత - క్రీడా పరికరాలు సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

క్రీడాపరికరాలు సీజ్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 13: మండలంలోని నలగాంపల్లె గ్రామానికి చెందిన విక్రమ్ కుమార్తె ఎన్‌పీ ఇషిక, తన స్నేహితురాలు నివేదితలు బెంగళూరులో చదువుకుంటూ క్రీడాకారిణులుగా రాణిస్తున్నారు. తమ స్వగ్రామంలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఆ ఇద్దరు స్నేహితురాళ్లు కలసి కొంత డబ్బులు కూడబెట్టుకుని క్రీడాపరికరాలు అందించాలని నిశ్చయించుకుని ఇషిక తండ్రి విక్రమ్‌కు తెలియజేశారు. శనివారం క్రీడా పరికరాలను కొనుగోలు చేసి తుంబపాళ్యం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అందజేశారు. ఈ సమయంలో అదే గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి సునీల్ కుమార్, అతడి అనుచరులు పాఠశాల వద్దకు చేరుకుని హెచ్ఎంను ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలా అనుమతిస్తారని డీఈవోకు ఫోన్ ద్వారా సమాచారం తెలియపరిచారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో నాగేశ్వరరావు పాఠశాలకు చేరుకుని హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడి డీఈవోకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. పాఠశాలకు ఫ్లయింగ్ స్క్వాడ్ చేరుకుని రూ.10వేలు విలువ చేసే క్రీడాసామగ్రిని స్వాధీనపరుచుకుని బంగారుపాళ్యం పోలీసులకు అప్పగించారు. దీంతో విక్రమ్‌పై కేసు నమోదు చేశారు. కాగా తుంబపాళ్యం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం మా పిల్లలకు ఎలాంటి క్రీడా సామగ్రిని సమకూర్చలేదని, మా పిల్లలకు ఏదైనా సాయం చేయండని మేమే ఎన్‌పీ విక్రమ్‌ను కోరామని చెప్పారు. దీనిపై వైసీపీ వారు రాద్ధాంతం చేయడం తగదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. అనంతరం ఎంఈవోకు, హెచ్ఎంకు అర్జీ ద్వారా తెలియజేశారు.

కాస్త తగ్గిన ఎండ.. అయినా ఉక్కపోత

చిత్తూరు, ఏప్రిల్ 13: జిల్లాలో శనివారం కాస్త ఎండ తగ్గింది. ఉదయం నుంచి మోడంగానే ఉన్న వాతావరణం సాయంత్రం 4 గంటలకు ఎండ వేడిమితో జనం అల్లాడిపోయారు. ఉక్కపోత తగ్గకపోవడంతో అవస్థ పడ్డారు. జిల్లాలో అత్యధికంగా నగరి, నింద్రలో 39.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. విజయపురం, శ్రీరంగరాజపురంలో 38.4, గుడిపాలలో 38.3, తవణంపల్లె, సోమలలో 38.1, పాలసముద్రంలో 37.7, చౌడేపల్లె, పుంగనూరులో 37.4, చిత్తూరు, కార్వేటినగరంలో 37.1, ఐరాల, కుప్పం, పులిచెర్ల, రొంపిచెర్లలో 36.7, సదుంలో 36.6, గంగవరం, బంగారుపాళ్యంలో 36.4, గంగాధరనెల్లూరు, గుడుపల్లెలో 36.3, పలమనేరు, పెనుమూరు, వెదురుకుప్పంలో 36.2, పెద్దపంజాణిలో 36.0, శాంతిపురంలో 35.5, వి.కోటలో 35.4, పూతలపట్టులో 34.7, యాదమరిలో 34.5, బైరెడ్డిపల్లె, రామకుప్పంలో 34.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నల్లబెల్లం తరలిస్తున్న వాహనం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

రామకుప్పం, ఏప్రిల్ 13: రామకుప్పం మండలం విజలాపురం సమీపంలోని సంతమిట్ట వద్ద శనివారం సాయంత్రం నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. సిబ్బందితో కలిసి ఎస్‌ఐ శివకుమార్ చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఈ వాహనం పట్టుబడింది. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట నుంచి 80బస్తాల నల్లబెల్లంతో.. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు తీసుకెళుతున్నట్లు వాహనంలోని వ్యక్తులు బిల్లులు చూపారని ఎస్‌ఐ తెలిపారు. దీనిపై తాము విచారణ జరుపుతున్నామన్నారు.

ఆ బెల్లం వీర్నమలకు తరలుతున్నదే?

ఈ బిల్లులో చూపినట్లు బంగారుపేట నుంచి వేలూరుకు వెళ్లాలంటే.. కేజీఎఫ్, వి.కోట, పేర్నాంబట్టు మీదుగా వెళ్లాలి. కానీ పోలీసులు దానిని రామకుప్పం మండలంలో స్వాధీనం చేసుకున్నారు. అంటే.. వీర్నమలకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి కొన్నేళ్లుగా నల్లబెల్లం దందా నడుపుతున్నట్లు తెలిసింది. తప్పుడు బిల్లులతో బంగారుపేట నుంచి నల్లబెల్లం తీసుకొచ్చి రామకుప్పం, కుప్పం మండలాల సరిహద్దుల్లోని అటవీప్రాంతాల్లో సారా తయారీదారులకు రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

48 ఏళ్ల పురుషుడికి 38ఏళ్ల మహిళ గుండె

శ్రీ పద్మావతి హృదయాలయలో 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతం



కర్నూలు నుంచి తీసుకొచ్చిన గుండెను శ్రీ పద్మావతి హృదయాలయలోకి తీసుకు వెళుతున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13: తాను చనిపోతూ మరో ముగ్గురి ప్రాణాలను కాపాడింది ఓ యువతి. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి (38)కి ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయం తగలడంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు.పరీక్షించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. అవయవ దానం చేయాలని వైద్యులు అభ్యర్థించగా ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారు.ఆమె కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, గుండెను, లివర్‌ను తిరుపతికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.తిరుపతికి హెలికాప్టర్‌లో తరలించిన గుండె, లివర్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా ఆస్పత్రులకు చేర్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గుండె శ్రీ పద్మావతి హృదయాలయానికి, లివర్ స్విమ్స్ ఆస్పత్రికి చేరుకున్నాయి.హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాకు చెందిన బాబూరావు (48)కు ఆ గుండెను వైద్యులు సుమారు 7 గంటలపాటు శ్రమించి అమర్చారు.దీంతో హృదయాలయ ఆస్పత్రిలో వరుసగా 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్టైంది.స్విమ్స్‌కు చేర్చిన లివర్‌ను త్వరలో అవసరమైన పేషెంటుకు అమర్చనున్నారు.

మామిడితోటలో మంటలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13: పాళ్యంపల్లె సమీపంలో మామిడితోపులో గుర్తు తెలియని వ్యక్తులు బీడీ ముక్కలు కాల్చి పారేయడంతో శనివారం మంటలు చెలరేగాయి. గమనించిన రైతులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మండలంలోని పాళ్యంపల్లెకు చెందిన దొరస్వామినాయక్ మామిడితోట లో దాదాపు రూ.15వేల విలువ చేసే చెట్లు కాలిపోయినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు.

వైభవంగా కుంభాభిషేకం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శాంతిపురం, ఏప్రిల్ 13: రాళ్ల బూదుగూరు పంచాయతీ శెట్టిగా నికురుబూరులో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్న పెద్దపులి గంగమాంబ అమ్మవారి కుంభాభిషేకం వైభవంగా జరిగింది. శనివారం ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం



కుప్పం, ఏప్రిల్ 13: కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీఈఎస్ వైద్య కళాశాల, హాస్పిటల్ సౌజన్యంతో శనివారం పీఈఎస్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. మొత్తం 52 మందికి కంటి పరీక్షలు చేయగా, 11 మందిని ఉచిత శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ మహేశ్ తెలిపారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి సెల్వం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కుప్పం, ఏప్రిల్ 13: ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో పట్టణాలు, గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కుప్పం శాసన సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.శ్రీనివాసులు తెలిపారు. గంగ జాతర ఊరేగింపులు, ఇతర ఉత్సవాలను అనుమతి వచ్చాకనే చేసుకోవాలని చెప్పారు.

అగ్ని మారెమ్మకు వసంతోత్సవం



గుడుపల్లె, ఏప్రిల్ 13: గుండ్లసాగరంలోని అగ్ని మారెమ్మ దేవాలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలిరాగా, ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



చౌడేపల్లె, ఏప్రిల్ 13: చిన్న కొండామరి సమీపంలో పురాతనమైన పశావులదిన్నే కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం శిథిలమవడంతో చిన్నకొండామరికి చెందిన మనోహర తన సొంత నిధులు రూ.30లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో శనివారం కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్మాణదాతలు అన్నదానం చేశారు.

సాయుధ బలగాల కవాతు



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ సాయుధ బలగాలు గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. శనివారం ఈడిగపల్లె, సుగాలిమిట్ట, నేతిగుట్లపల్లె, మోదుగుల పల్లె, భీమగానిపల్లె, భగత్ సింగ్‌కాలనీ, గూడూరుపల్లె తదితర ప్రాంతాల్లో కవాతు జరిగింది.

18న వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్

కుప్పం, ఏప్రిల్ 13: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన కేఆర్‌జే భరత్ ఈనెల 18వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్పలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్ట్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13: కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు తెలిపారు. మండలంలోని అరవపల్లెకి చెందిన సుబ్బు, తూర్పుమొగసాలకు చెందిన మురళిలు కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారి వద్ద నుంచి మూడు లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు.

గురుకుల విద్యాలయంలో 75శాతం ఉత్తీర్ణత

రామకుప్పం, ఏప్రిల్ 13: రామకుప్పం అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులు సీనియర్ ఇంటర్‌లో 75.44శాతం, జూనియర్ ఇంటర్‌లో 61శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. సీనియర్ ఇంటర్ పరీక్షలకు 57మంది హాజరవగా 43మంది, జూనియర్ ఇంటర్ పరీక్షలకు 61మంది హాజరవగా 45మంది ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. ఇక రామకుప్పం ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫలితాలు నివ్వెరపరుస్తున్నాయి. జూనియర్ ఇంటర్ పరీక్షలకు 11మంది హాజరవగా కేవలం ఒక్కరే ఉత్తీర్ణులయ్యారు. సీనియర్ ఇంటర్ పరీక్షలకు 20మంది హాజరవగా 8మంది ఉత్తీర్ణులయ్యారు. రామకుప్పం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షలకు 68మంది విద్యార్థులు హాజరవగా 48మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ నీరజ తెలిపారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థిని


అతాఖున్నిషాను అభినందిస్తున్న ఎంఈవో రెడ్డెన్నశెట్టి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13: పట్టణంలోని కస్తూర్బా గాంధీ కళాశాల విద్యార్థిని అతాఖున్నిషా రాష్ట్రస్థాయిలో సత్తా చాటిందని ఎంఈవో రెడ్డెన్నశెట్టి తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వాసియాఫర్హత్ తోకలసి విద్యార్థినికి అభినందనలు తెలిపారు. కళాశాలలో 33మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 28మంది అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అతిఖున్నిషా 979మార్కులు సాధించి రాష్ట్రంలో టాపర్‌గా నిలిచిందన్నారు. అజ్మియాభాను 954, సభానాజ్ 944మార్కులు సాధించారని వివరించారు. అలాగే ప్రథమ సంవత్సంలో యాస్మిన్ 487, కళ్యాణి 479,మెహతాజ్476 మార్కులు సాధించినట్లు చెప్పారు.

ఆకట్టుకున్న సాసవల చిన్నమ్మ కథ



సోమల, ఏప్రిల్ 13: సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయం వద్ద మదనపల్లె ప్రసాద్ బృందం కళాకారులు ప్రదర్శించిన 'సాసవల చిన్నమ్మ కథ' ఆహూతులను ఆకట్టుకుంది. శనివారం ఉదయం ఆరు గంటల వరకు ఈ ప్రదర్శన సాగింది. స్థానిక టమోటా దినసరి మహిళా కూలీల సహకారంతో ఈ ప్రదర్శన జరిగింది.

బలిజలంతా టీడీపీవైపే..

- సమావేశంలో తీర్మానం చేసిన నాయకులు


మీడియాతో మాట్లాడుతున్న కాపు, బలిజ జేఏసీ నాయకులు, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, ఏప్రిల్ 13: రాష్ట్రంలోని కాపు, తెలగ, బలిజలంతా టీడీపీవైపే ఉన్నారని ఆ సామాజిక వర్గాల సమావేశం తీర్మానించింది. రాష్ట్రంలో టీడీపీ గెలుపునకు, కుప్పంలో చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తామని ప్రకటించింది. కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు, కాపు సద్భావన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధి నూకరాజు, టీడీపీ రాష్ట్ర బలిజ సంఘం అధ్యక్షుడు పి.గోపీనాథ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగానూ, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ ఆయా నాయకులు మాట్లాడుతూ.. కాపు, బలిజ సామాజిక వర్గానికి టీడీపీ ఎప్పుడూ అండగా నిలబడిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధికి బాటలు వేశారని గుర్తు చేసుకున్నారు. వైసీపీ పాలనలో కాపులను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మేమున్నామని అండగా నిలిచిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి దుర్మార్గ పాలననుంచి కాపాడేందుకు టీడీపీకి, చంద్రబాబుకు మద్దతు ఇస్తామని ప్రకటించిన కాపు, బలిజ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు జేఏసీ యువ నాయకులు ఆకుపాటి వెంకటేశ్, కాపు జేఏసీ రాష్ట్ర నాయకులు చిన్నబాబు, చిత్తూరు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రామమూర్తి, సత్యేంద్రశేఖర్, ఆర్ఆర్.రవి, మంజునాథ్, సోమశేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల మనోభావాలతో రాజకీయమా?

- దురదృష్టకరమన్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి


టీడీపీలో చేరిన మైనారిటీ నాయకులతో అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 13: ముస్లింల మనోభావాలతో రాజకీయం చేయడం దురదృష్టకరమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. పలమనేరు టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలోని 26వ వార్డుకు చెందిన పలువురు వైసీపీకి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు అమర్ సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. వీరిలో.. 26వ వార్డు ఇన్‌చార్జి జావిద్, బూత్ సభ్యులు షంషీర్‌తోపాటు రెజ్వాన్, నాగరాజు, అమీర్‌ఖాన్, ఎం.కిరణ్, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ముస్లింలకు చేసిన కార్యక్రమాలు ఏమీ లేవన్నారు. పైగా టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన షాదీ మహల్ పనులను మధ్యలోనే ఆపేసి, కూల గొట్టే ఆలోచనతో వైసీపీ నాయకులు ఉన్నారని మండిపడ్డారు. పలమనేరు, పుంగనూరు ప్రాంతంలోని ముస్లిం సోదరులతో మమేకమై పెరిగామని, అటువంటిది వారి మనోభావాలకు నష్టం జరిగితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్వీ బాలాజి, ఖాజాపీర్, ఆర్బీసీకుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, కృష్ణమూర్తి, బీఆర్సీకుమార్, మదన్, మురళి, విజయ్, వాసు, భాస్కర్, నందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కొండయ్యగారి పల్లెలో ప్రజా సమస్యలపై ఆరా


దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో అమరనాథరెడ్డి

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ తిరుమల కొండయ్యగారిపల్లెలో సీతాముల ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమరనాథరెడ్డి హాజరయ్యారు. అనంతరం గ్రామంలో పర్యటించి, ప్రజాసమస్యలపై ఆరాతీశారు. టీడీపీ నాయకులు మాజీఎంపీపీ మురళీకృష్ణ, ఆనంద్, చలపతి, నాగరాజరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, భూపతి, బుద్ధు, రఘునాథరెడ్డి, ముబారక్‌తాజ్, నవీన్, దిలీప్, హరినాథ్, మణి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జనసేన అభ్యర్థి గెలుపు కోసం కృషి


పవన్‌తో సురేశ్ కరచాలనం

పుంగనూరు, ఏప్రిల్ 13: తిరుపతి జనసేన అభ్యర్థి శ్రీనివాసులు గెలుపు కోసం కృషి చేస్తామని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి సోమల సురేశ్ తెలిపారు. శనివారం తిరుపతిలో జనసేన అధినేతను మర్యాదపూర్వకరంగా కలిశారు. ప్రజారాజ్యం పార్టీలో ఉన్నప్పటి జ్ఞాపకాలపైనా చర్చించుకున్నట్లు తెలిపారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి: బీసీవైపీ


నక్కబండలో బీసీవైపీ నేతల ప్రచారం

పుంగనూరు, ఏప్రిల్ 13: పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ అరాచకపాలనకు ప్రజలు స్వస్తి పలకాలని బీసీవైపీ నేతలు సాంబమూర్తి, హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణ సమీపంలోని నక్కబండలో పర్యటించి, బీసీవైపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. వెంకటేశ్, రమణ, సమీఉల్లా, నూర్, వేణు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయం

చల్లా రామచంద్రారెడ్డి


భగత్‌సింగ్ కాలనీలో పర్యటిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 13: పుంగనూరు నియోజకవర్గంలో తెలుగుదేశం గెలుపు ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి జోస్యం చెప్పారు. శనివారం పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీ, మేలుపట్ల, హరిజనవాడ, కొత్తయిండ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ఆయనమాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండో స్థానంలో ఉన్నానంటూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నట్లు ప్రచారం తప్ప మంత్రి పెద్దిరెడ్డి చేసింది శూన్యమని మండిపడ్డారు. పట్టణంలో ఎక్కడ చూసిన రోడ్లు, కాల్వలు దెబ్బతిని మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని వాపోయారు. టీడీపీ అధికారంలోకి రాగానే పట్టణాభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. వైసీపీ అరాచకాలను చూసి భయపడిన యువత టీడీపీలోకి వస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మొర్వభీమగానిపల్లె, పట్టణంలోని ఏటిగడ్డపాళ్యం, గాంధీనగర్, ఎంబీరోడ్డుకు చెందిన మైనార్టీ యువత అధిక సంఖ్యలో పార్టీలో చేరినట్లు వివరించారు. మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో చల్లా రామచంద్రారెడ్డిని, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అధిక మెజర్టీతో గెలించాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు శ్రీకాంత్, మురాధి దినేశ్, సీవీరెడ్డి, పోలీస్ గిరి, సుబ్రహ్మణ్యంరాజు, రెడ్డెప్పనాయుడు, కవిత, దేశాధి ప్రకాశ్, నవీన్, మాధవరెడ్డి, రెడ్డెప్పయాదవ్, కృష్ణానాయక్, రామయ్య, గాజులరమణ, శ్రీనివాసులు, ఐటీడీపీ కుమార్, జనసేన నాయకులు విరూపాక్షి, హరినాయక్, బాలాజీనాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 13: పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో రొంపిచెర్లలోని ఆయన ఇంటి వద్ద పులిచెర్లలోని వైసీపీకి చెందిన 25మంది టీడీపీలో చేరారు. వీరిలో.. కె.లోకేష్, ఎం.శ్రీనివాసులు, ఎస్.అక్బర్, పి.రాజేష్, వి.చరణ్, జి.సందీప్, నవీన్, పవన్, అభిరాం, రేవంత్, బాలాజి, టి.రేవంత్, రెడ్డిబాషా, కుమార్, అరవింద్, తేజ్‌కుమార్ తదితరులున్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పని చేయాలని రాజంపేట పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు చంద్రగిరి మనోజ్‌కుమార్ పిలుపునిచ్చారు. చెంచెమరెడ్డిగారిపల్లె గ్రామంలోని శ్రీరాములు గుడి వద్ద శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, ఎన్‌డీఏ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమారెడ్డి గెలుపునకు కృషిచేయాలి పిలుపునిచ్చారు. చేనేత సంఘం జిల్లా కార్యదర్శి పురం మల్లయ్య, టీడీపీ నాయకులు చంగల్‌రెడ్డి, రఘు, ఈశ్వరయ్య, చెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరిన పులిచెర్ల వైసీపీ నాయకులతో చల్లా బాబు

మోదీ, చంద్రబాబుతోనే అభివృద్ధి: బీజేపీ


పరికిదోనలో బీజేపీ నేతల ప్రచారం

చౌడేపల్లె, ఏప్రిల్ 13: ప్రధానిగా మోదీ, సీఎంగా చంద్రబాబు ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు చిన్నకిశోర్ అన్నారు. శనివారం సింగిరిగుంట, పరికిదోన, నుంజార్లపల్లె, దోనపల్లె, గడ్డంవారిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్, ఐటీ సెల్ కన్వీనర్ ప్రవీణ్, నాయకులు శ్రీనివాసులు, రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో నేడు బైక్ ర్యాలీ: చౌడేపల్లె మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో చౌడేపల్లె మండలంలో ఈర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు అంబేడ్కర్ జయంత్యుత్సవాలు

పుంగనూరు, ఏప్రిల్ 13: అంబేడ్కర్ జయంత్యుత్సవాలను ఆదివారం నిర్వహించనున్నట్లు దళిత సంఘనాయకులు వైవీరమణ, జెవీ.నాగరాజ తెలిపారు. స్థానిక జమీందారుప్యాలెస్ నుంచి భారీ స్థాయిలో బల్లారి డమ్ములు, మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న గజదాడులు


ధ్వంసమైన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, మామిడి చెట్లు

గుడిపాల, ఏప్రిల్ 13: గుడిపాల మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ముత్తువాళ్లూరు సమీపంలో పార్థసారథి నాయుడు, భూపతి నాయుడుకు చెందిన మామిడి.. కొబ్బరి తోటలను, డ్రిప్ పరికరాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులు బాణసంచా పేల్చి తమిళనాడు వైపు తరలించారు.

దేవర ఎద్దు హఠాన్మరణం


దేవర ఎద్దు(ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, ఏప్రిల్ 13: కామసాని కులస్తులకు సంబంధించిన దేవర ఎద్దు శనివారం రాత్రి చనిపోయిందని ఆ కుల పెద్దలు తెలిపారు. వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ కొండారెడ్డివూరు కనుగొండరాయ స్వామి గుడి దగ్గర దేవర ఎద్దుకు అంత్యక్రియలను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు, కామసాని కులస్తులు హాజరు కావాలని కోరారు.

మానవ మనుగడకు పక్షులు అవసరం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13: మానవ మనుగడకు పక్షులు అవసరమని బర్డ్ మాన్ కార్తీక్ అన్నారు. శనివారం చిత్తూరు అపోలో యూనివర్సిటీలో మానవ మనుగడకు పక్షులు ఏ విధంగా ఉపయోగపడతాయి.. వాటి రక్షణ అంశంపై ప్రముఖ అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్, వైల్డ్ లైఫ్ పరిశోధకులచే విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ మానవ మనుగడకు, కాలుష్య నివారణకు, అడవుల్లో అరుదైన మొక్కలు పెరగడానికి పక్షులు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. శేషాచలం అడవులు చాలా అరుదైన వన్యప్రాణులకు నివాసమని, సుమారు 215 రకాల పక్షులు ఉన్నాయని తెలిపారు. అందులో ఇప్పటి వరకు 190 రకాల పక్షులను గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పక్షుల సంరక్షణ తదితర అంశాల గురించి కార్తీక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిట్ హెడ్ నరేష్‌రెడ్డి, ప్రొఫెసర్లు సేతు, కైలాష్‌నాథ్‌రెడ్డి, మహేంద్రనాథ్, షానీ, నవీన్, పురుషోత్తం, ఫిరోజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ అరాచకాలకు బుద్ధి చెప్పాలి'

పుంగనూరు, ఏప్రిల్ 13: 'వైసీపీ అరాచకాలు, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలకు బుద్ధి చెప్పాలి. ఇందుకోసం టీడీపీ, బీజేపీ అభ్యర్థులను బలిజ కులస్తులు గెలిపించాలి' అని కాపు జేఏసీ నాయకుడు వాసిరెడ్డిఏసుదాసు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బలిజ కులస్తుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో పాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో నిర్మించిన ప్రాజెక్టు దగ్గర భూములు కోల్పోయిన రైతులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నష్టపరిహారం వెంటనే చెల్లించాలన్నారు. నియోజకవర్గంలోని కాపులు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు సిద్దు నూకరాజు, వెంకటేశ్, చిన్నబాబు, గన్నా మదన్‌మోహన్‌బాబు, నానబాలకుమార్, రామమూర్తి, ప్రకాశ్ నరేశ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రుణం తీర్చుకుందాం

- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



శాంతిపురం, ఏప్రిల్ 13: కుప్పం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన అభివృద్ధిని ఒక్కసారి గుర్తు చేసుకుని, ఆయనకు ఓట్లేసి రుణం తీర్చుకుందామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు, మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు పిలుపునిచ్చారు. శనివారం కెనమాకులపల్లె పంచాయతీ పరిధిలోని శాంతిపురం, ఆరిముత్తనపల్లె, బడుకుమాకులపల్లె, కెనమాకులపల్లె, ఎద్దులపల్లె గ్రామాల్లో యూనిట్ ఇన్‌చార్జి ఎల్.జయరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. చంద్రబాబును లక్ష ఓట్లు మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉదయకుమార్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, మండల టీడీపీ వన్నియకుల క్షత్రియ అధ్యక్షుడు గోవిందరాజులు, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, గోపాల్, రుద్రప్ప, బాలు, రాజేంద్ర, సుబ్రహ్మణ్యం, బాబు, బసవరాజు, జయరాజ్, మురళి, ఏఎంసీ నాగరాజు, నారాయణస్వామి, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, నాగభూషణంరెడ్డి, చలపతి, హరినాథ్‌రెడ్డి, రామకృష్ణ, కేశవులు, రమేష్, రాధాకృష్ణ, రాజారెడ్డి, ఈడిగ శివశంకర్‌గౌడు, మండల మహిళ అధ్యక్షురాలు శ్యామల, ప్రధాన కార్యదర్శి రూప, మాజీ ఎంపీపీ పుష్ప, అనసూయ, సుగునమ్మ, చంద్రకళ, పౌలారాణి, హేమవతి, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

బందార్లపల్లె క్రాస్‌లో టీడీపీ శంఖారావం



రామకుప్పం, ఏప్రిల్ 13: రామకుప్పం పట్టణంలోని బందార్లపల్లెక్రాస్‌లో శనివారం టీడీపీ నాయకులు శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ సీతాపతి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, తెలుగుయువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరగాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించాలని కోరారు. నేతలు రామకృష్ణప్ప, సలాంసాబ్, నందారెడ్డి, టీవీరవి, పద్మనాభరెడ్డి, సుబ్రీ, సతీష్, మంజునాథ్, అవినాశ్, అమర్, ఆదిల్, నియాజ్, అక్బర్‌బాషా, శంకర్, ఆంజి, బొరుగులశీనా, మురళీ, చలపతి, నిసార్, చాంద్‌బాషా, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే కురబలకు న్యాయం



రామకుప్పం, ఏప్రిల్ 13: రాష్ట్రంలో టీడీపీతోనే కురబ కులస్తులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రామకుప్పం మండల కురబకుల నేతలు నాగభూషణం, గంట్లప్పగౌడు, వెంకటేశ్‌గౌడు, విశ్వనాథ్ తెలిపారు. శనివారంవారు పెద్ద గెరిగపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును భారీ మెజారిటీతో గెలపించాలని కోరారు. నేతలు సీజీగంట్లప్ప, భాస్కర్, బాలకృష్ణ, మురుగేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే అన్నివర్గాల అభివృద్ధి

గుడుపల్లె, ఏప్రిల్ 13: చంద్రబాబు సీఎం అయితేనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం సంగనపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు బాబు నాయుడు, చంద్రశేఖర్, మునిరాజు, బేటప్పనాయుడు, హేమాంబర్ గౌడు, కుప్పం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శివశంకర్, జనసేన మండలాధ్యక్షులు అమీర్, భానుమూర్తి, నారాయనమూర్తి, ఉదయ్‌కుమార్, ప్రకాష్, మంజునాథ్, వెంకటేశ్, ఎల్లప్ప, సుబ్బు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

కుప్పం, ఏప్రిల్ 13: కుప్పం మండలం మిట్టపల్లె వేపూరు పంచాయతీ వేపూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు తిమ్మప్ప గౌడ్, చిన్నప్ప గౌడ్, చంద్రన్ గౌడ్‌లు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో వారు టీడీపీలో చేరారు.

టీడీపీ నాయకుడి మృతికి మాజీమంత్రి సంతాపం

పెద్దపంజాణి, ఏప్రిల్ 13: టీడీపీ సీనియర్ నాయకుడు మునివెంకటప్ప శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం పెనుగొళకలలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి అమరనాథరెడ్డి శనివారం టీడీపీ నాయకులతో వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మునివెంకటప్ప కుటుంబీకులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

'బీజేపీపై వైసీపీ అసత్య ప్రచారాలను ముస్లింలు నమ్మొద్దు'

పుంగనూరు, ఏప్రిల్ 13: బీజేపీపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ముస్లింలు నమ్మొద్దని మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు అయూబ్‌ఖాన్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఇఫ్తార్‌విందుకు పిలిచిన పట్టణంలోని అంజుమాన్‌కమిటీ సభ్యులు రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. పవిత్రమైన షాదీమహల్‌లో ఓ మైనార్టీ నాయకుడు మాట్లాడుతూ.. టీడీపీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకవేళ ఓట్లు వేస్తే మగవారికి గడ్డం అవసరం ఉండదని, మహిళలకు బురఖా అవసరం ఉండదని చెప్పడం బాధాకరమని చెప్పారు. సంప్రదాయ పద్ధతిలో జరుపుకునే పండగ రోజు ఇలా రాజకీయంగా మాట్లాడటం సరికాదన్నారు. ఇలా మాట్లాడే వైసీపీ నాయకులకు ఎలా బుద్ధి చెప్పాలో ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆ వీడియోలో పేర్కొన్నారు.

చిత్తూరు కోదండరామాలయంలో నేటినుంచి బ్రహ్మోత్సవాలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 13: చిత్తూరులో అత్యంత ప్రాశస్త్యం పొందిన కోదండ రామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్ తెలిపారు.

మానవ మనుగడకు పక్షులు అవసరం



మాట్లాడుతున్న బర్డ్ మాన్ కార్తీక్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13: పక్షులు మానవ మనుగడకు అవసరమని బర్డ్ మాన్ కార్తీక్ అన్నారు. శనివారం చిత్తూరు అపోలో యూనివర్సిటీలో మానవ మనుగడకు పక్షులు ఏ విధంగా ఉపయోగపడతాయి.. వాటి రక్షణ అంశంపై ప్రముఖ అంతర్జాతీయ ఫొటో గ్రాఫర్, వైల్డ్ లైఫ్ పరిశోధకులచే విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ మానవ మనుగడకు, కాలుష్య నివారణకు, అడవుల్లో అరుదైన మొక్కలు పెరగడానికి పక్షులు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. శేషాచలం అడవులు చాలా అరుదైన వన్యప్రాణులకు నివాసమని, సుమారు 215 రకాల పక్షులు ఉన్నాయని తెలిపారు. అందులో ఇప్పటి వరకు 190 రకాల పక్షులను గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పక్షుల సంరక్షణ తదితర అంశాల గురించి కార్తీక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిట్ హెడ్ నరేష్‌రెడ్డి, ప్రొఫెసర్లు సేతు, కైలాష్‌నాథ్‌రెడ్డి, మహేంద్రనాథ్, షానీ, నవీన్, పురుషోత్తం, ఫిరోజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదాసు కీర్తనలు - తత్వాలు గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణ చేస్తున్న సాహితీ వేత్తలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 13: ఆధ్యాత్మిక సాహిత్యంతోనే సమాజ, సాంస్కృతిక రంగాలు వెల్లివిరుస్తాయని జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ కె. రామలక్ష్మి అన్నారు. శనివారం డీఐ రోడ్డులోని ఒక హోటల్‌లో చిత్తూరు హరివిల్లు సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత కృష్ణదాసు రచించిన శ్రీకృష్ణదాసు కీర్తనలు - తత్వాలు పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. హరివిల్లు గౌరవాధ్యక్షులు రచయిత హరి నాయుడు మాట్లాడుతూ రచనలు లేనిదే చరిత్ర లేదని, ఆధ్యాత్మిక రచనలతో సామాజిక, ఆర్థిక, వైవిధ్యభరితమైన సమస్యలకు పరిష్కారాలు ఉంటాయన్నారు. సాహితీవేత్త బి. మునుస్వామి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక యుగంలో సాహితీవేత్తలకు ప్రోత్సాహం కరువైందని, ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్టమంచి బాలకృష్ణారెడ్డి, నందకుమార్ రెడ్డి, సిద్దారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్లదే కీలకపాత్ర

● చిత్తూరు నియోజకవర్గ ఆర్వో, జేసీ శ్రీనివాసులు

చిత్తూరు, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్ల పాత్ర కీలకమని చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు అన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లకు శనివారం నగరపాలక కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలు, పోలింగ్ రోజున నిర్వహించాల్సిన విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా కంట్రోల్ యూనిట్, బ్యాలెట్, వీవీ ప్యాట్‌లు ఎలా పనిచేస్తాయి, వాటిని ఎలా ఆపరేట్ చేయాలి అనే అంశాలపై మాస్టర్ ట్రైనర్ సౌందర్‌రాజన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు చిన్నయ్య, మనోజ్‌కుమార్, ఏఆర్వో అరుణ తదితరులు పాల్గొన్నారు.

వేలూరు సీఎంసీ, నర్వీ ఆసుపత్రులకు డబ్బులు తీసుకెళ్లేవారిని ఇబ్బంది పెట్టొద్దు: ఆర్వో వెంకటశివ

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13: అత్యవసర పరిస్థితుల్లో గాని, అనారోగ్య సమస్యవల్ల గాని వేలూరు సీఎంసీ, నర్వీ ఆస్పత్రులకు డబ్బులు తీసుకెళ్లే గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలను ఎన్నికల టీమ్ అధికారులు, స్క్వాడ్ అధికారులు ఇబ్బంది పెట్టరాదని, మానవతా దృక్పథంతో పంపించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ ఆదేశించారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో శనివారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల నిబంధనలపై ఆర్వో అవగాహన సమావేశం నిర్వహించారు. పీసీసీ అధికార ప్రతినిధి గోవర్థన్‌రెడ్డి మాట్లాడుతూ పలు గ్రామాల్లోని తాగునీటి ట్యాంక్‌లకు వైసీపీ రంగులు ఉన్నాయని, ఇంటింటి వద్ద వైసీపీకి చెందిన సీఎం జగన్ బొమ్మలతో గల స్టిక్కర్లను తొలగించాలని ఆర్వోకి విన్నవించారు. రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే తగినచర్యలు తీసుకుంటామని ఆర్వో తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్, మండల బీజేపీ అధ్యక్షుడు మురళి, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి భాస్కర్, యోనా, వైసీపీ నేత కాళప్ప, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు



ఎంఎస్ బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13: పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల, తవణంపల్లి, యాదమరి మండలాల నుంచి సుమారు 100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరులోని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కార్యాలయంలో ఎంఎస్ బాబు వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విక్టోరియా, రాణి యాదవ్, నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈడిగ, గౌడ, బీసీ సాధికార పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 13: చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఈడిగ, గౌడ, బీసీ సాధికార పోస్టర్‌ను పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ చిత్తూరు నగరంలోని ఆయన స్వగృహంలో శనివారం విడుదల చేశారు. మురళీమోహన్ మాట్లాడుతూ టీడీపీ గెలుపునకు బీసీలంతా ఏకమవ్వాలన్నారు. అనంతరం బీసీ నాయకులు ఆయన్ను దుశ్శాలువలతో సన్మానించారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు బుస్సా నాగరాజ్, పూతలపట్టు మండల అధ్యక్షుడు గిరి, ఉపాధ్యక్షుడు భార్గవ్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్లో చైతన్యపరచాలి

గుడిపాల, ఏప్రిల్ 13: సూపర్ సిక్స్ పథకాల గురించి గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యపరచాలని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, సీనియర్ నేత చెన్నకేశవులు నాయుడు అన్నారు. శనివారం గుడిపాల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు చురుగ్గా పాల్గొని టీడీపీని బలోపేతం చేయాలని చెప్పారు. ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందించే విధంగా కార్యకర్తలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కిట్టు, బాలాజి పాల్గొన్నారు.

సార్.. ఈ స్టిక్కర్లకు కోడ్ వర్తించదా?



వాహనంపై ఉన్న జగన్, రోజా స్టిక్కర్లు

నగరి, ఏప్రిల్ 13: సార్.. ఈ స్టిక్కర్లకు ఎన్నికల కోడ్ వర్తించదా? ఇదేమి న్యాయమండి.. అంటున్నారు నగరి ప్రజలు. పట్టణ పరిధిలోని తిరుపతి - చెన్నై జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఓ ప్రైవేటు మెకానిక్ షెడ్ వద్ద వెళ్లే వారికి కనిపించేలా ఉన్న ఓ వాహనంపై సీఎం జగన్, మంత్రి రోజా బొమ్మలతో కూడిన స్టిక్కర్లు ఉన్నాయి. ఈ స్టిక్కర్లకు ఎన్నికల కోడ్ వర్తించదా సారూ.. అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కృష్ణావతారంలో శ్రీమహావిష్ణువు



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 13: గిరింపేట వీరాంజనేయస్వామి ఆలయంలో గత ఐదు రోజులుగా శ్రీమహా విష్ణువు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారికి అభిషేకం నిర్వహించి శ్రీకృష్ణావతారం అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఉత్సవ నిర్వాహకులు కె.ఎస్.కుమార్, రెడ్డిగుంట కిషోర్, అర్చకులు కిషోర్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే బీసీలకు గుర్తింపు

● జయహో బీసీ సమావేశంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్



సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

గుడిపాల, ఏప్రిల్ 13: బీసీలకు గుర్తింపు తెచ్చిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుకే దక్కుతుందని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఆర్. గాంధీ, మాజీ జడ్పీటీసీలు బాలాజీ నాయుడు, సుమతి అన్నారు. శనివారం మండలంలోని రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లెలో జయహో బీసీ కార్యక్రమాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అక్రమ కేసులు ఎక్కువయ్యాయని, ఈ అరాచకపాలనకు చరమగీతం పాడేందుకు బీసీలంతా ఏకమై ఆ పార్టీని ఓడించాలన్నారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌లను గెలిపించాలని వారు కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గ్రామస్తులు వారి దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి రాగానే వాటన్నిటినీ దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు. రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, టీడీపీ సీనియర్ నేత చెన్నకేశవులు నాయుడు, జిల్లా కార్యదర్శి వెంకటేష్ యాదవ్, చిత్తూరు నగర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి రాధాకృష్ణన్, న్యాయవాది త్రిమూర్తి, విజయకుమార్, పళణి, రవి నాయుడు, నాయకులు మురళీ నాయుడు, వెంకటేష్ యాదవ్, శంకర్ గౌడ్, జయచంద్ర గౌడ్, అర్జున్, మోహన్ గౌడ్, షణ్ముగం, ఆర్ముగం, కిట్టు, గోవింద నాయుడు, రమేష్, శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రావణ కాష్టంలా మారిన రాష్ట్రం

● టీడీపీని గెలిపించండి.. అభివృద్ధి చేస్తాం: గురజాల



విజయ చిహ్నాన్ని చూపుతున్న గురజాల, టీడీపీ నేతలు, కార్యకర్తలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13: వైసీపీ పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారింది.. టీడీపీని గెలిపించండి.. అభివృద్ధి చేస్తామని కూటమి చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం చిత్తూరు రూరల్ మండలంలోని చెన్నసముద్రం, నాయనిచెరువు, దిగువూరు, పెద్దశెట్టిపల్లి, తొప్పాలిపల్లి, తుమ్మింద పంచాయతీల్లో గురజాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలో మహిళలు, ప్రజలు, కార్యకర్తలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఎక్కడ చూసినా వందల సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, కూల్చడాలు, దాడులు, గంజాయి, మద్యం, స్కాములతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోయారన్నారు. వైసీపీకి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. అనంతరం టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ మండలంలో వైసీపీ పాలనలో ఒక్క రోడ్డు అయినా వేశారా అని ప్రశ్నించారు. టీడీపీకి ఓటు వేసి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు,మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, రాజేంద్రన్, కాశీ, కాటమరాజు, రమేష్‌నాయుడు, దేవరాజులు నాయుడు, బీజేపీ నాయకులు బాబు, నరేష్‌కుమార్, హేమంత్, జనసేన నాయకులు యశ్వంత్, బాలు, గోవింద్, హరీష్ తదితరు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రతిమ తదితరులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. శనివారం నగరంలోని 13, 15 డివిజన్లలో తెలుగు మహిళలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిమకు మహిళలు మంగళహారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రతిమ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందారని అన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధరణీ నాయుడుకు పలువురి శుభాకాంక్షలు



కేక్‌ను కట్‌చేస్తున్న ఎన్‌పీ ధరణీ నాయుడు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 13: మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీ నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన స్వగ్రామమైన నలగాంపల్లెలో అభిమానుల నడుమ భారీ కేక్‌ను కట్‌చేసి, అందరికీ పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, ఎన్‌పీ జయచంద్ర నాయుడు, ఎన్‌పీ సురేంద్ర నాయుడు, కోదండయాదవ్, హేమచంద్ర నాయుడు, తవణంపల్లె, ఐరాల, యాదమరి, పూతలపట్టు మండలాల టీడీపీ అధ్యక్షులు దిలీప్, గిరిబాబు, మొరార్జీ, దొరబాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా మండలాభిషేక పూజలు

విజయపురం, ఏప్రిల్ 13: విజయపురంలోని సీతారాముల స్వామి ఆలయంలో శనివారం మండల అభిషేక పూజను సిద్ధార్థ గ్రూపు విద్యాసంస్థల అధినేత కొండూరు అశోకరాజు, ఇందిరవేణి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ కుంభాభిషేకం నిర్వహించి 48వ రోజుకు చేరుకోవడంతో ఉదయం కలశస్థాపన, మండల అభిషేకం నిర్వహించి తీర్థప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో సీతారాముల స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు.

మట్టిలో మాణిక్యం

- రైతు బిడ్డకు ఉత్తమ మార్కులు



విద్యార్థి భరత్‌తో తల్లిదండ్రులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 13: మట్టిలో మాణిక్యం. రైతు కుటుంబంలో పుట్టిన చదవరి. ఇంటర్మీడియట్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించాడు. అతనే వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ గుంతలచేను గ్రామానికి చెందిన రైతు ఎద్దల రామకృష్ణారెడ్డి, తులసీ దంపతుల కుమారుడు భరత్. తమ బిడ్డను ఏపీఆర్జేసీ గ్యారంపల్లిలో ఇంటర్మీడియట్ (ఎంఈసీ) చదివిస్తున్నారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో భరత్‌కు 500 మార్కులకు 485 మార్కులు వచ్చి ఏపీఆర్జేసీ స్టేట్ రెండవ ర్యాంకు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు ఉపాధ్యాయ బృందం తెలిపారని విద్యార్థి తల్లిదండ్రులు శనివారం పేర్కొన్నారు. మాబిడ్డ స్టేట్ రెండవ టాపర్‌గా ఉత్తీర్ణత సాధించడం ఎంతో సంతోషకరంగా ఉందని ఆ తల్లిదండ్రులు తెలిపారు.

జాతరలు, ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి: ఆర్డీవో

నగరి, ఏప్రిల్ 13: ఎన్నికల నియమావళి అమలులో వున్నందున జాతరలు, ఊరేగింపులు, ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నగరి నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కఠినచర్యలు తప్పవన్నారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, ఏప్రిల్ 13: నిరుపేదల కడుపు నింపడానికే అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శనివారం దివంగత మాజీ టీడీపీ అధ్యక్షుడు కమలేష్ నాయుడు వర్థంతి సందర్భంగా ఆయన సోదరుడు బోడెబ్బ నాయుడు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలాజీ నాయుడు, టీడీపీ నాయకులు చెన్నకేశవులు నాయుడు, జగదీశ్వర్ నాయుడు, సాంబశివ నాయుడు, కేబీ ప్రసాద్, బాల సుబ్రహ్మణ్యం యాదవ్, శంకర్ చౌదరి, రవి నాయుడు, రాజా, కిట్టు, హరి నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 13: చవటగుంటలోని వినాయక, లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం నరసింహస్వామికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు దర్శన వసతి కల్పించి, తీర్థప్రసాదాలను అందించారు. అన్నదానం చేశారు. భజన బృందం భజన చేశారు.

శాస్త్రోక్తంగా దక్షిణామూర్తికి అభిషేకం

వెదురుకుప్పం, ఏప్రిల్ 13: వెదురుకుప్పం మండలం చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేయించారు. ఈ క్రమంలో విఘ్నేశ్వరపూజ, దక్షిణామూర్తికి అభిషేకం, చండీశ్వరస్వామికి అభిషేకం, మీనాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కొనసాగుతున్న గజదాడులు



ధ్వంసమైన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, మామిడి చెట్లు

గుడిపాల, ఏప్రిల్ 13: గుడిపాల మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ముత్తువాళ్లూరు సమీపంలో పార్థసారథి నాయుడు, భూపతి నాయుడుకు చెందిన మామిడి.. కొబ్బరి తోటలను, డ్రిప్ పరికరాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులు బాణసంచా పేల్చి తమిళనాడు వైపు తరలించారు.

టీడీపీకి అభివృద్ధే నినాదం... రోజాకి అవినీతే ప్రధానం



ఇంటింటి ప్రచారంలో గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 13: టీడీపీకి అభివృద్ధే నినాదం కాగా, రోజాకి మాత్రం అవినీతే ప్రధానమని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ధ్వజమెత్తారు. శనివారం పుత్తూరు పట్టణ పరిధిలోని 15వ వార్డు రామారావు కాలనీ, రామానాయుడు కాలనీ, ఎంబీ రోడ్డులో వార్డు అధ్యక్షుడు సీఎం శరవణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముద్దుకృష్ణమ నాయుడు హయాంలో పుత్తూరులో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. పుత్తూరు అభివృద్ధితో పాటు చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుతో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డి.ప్రసాద్‌రావును గెలిపించుకోవాలని అభ్యర్థించారు. మాజీ కౌన్సిలర్ పుష్పలత, జలకం సునీల్, గోపీనాథ్, చాన్‌బాషా, రఫీ, శ్రీనివాసులరాజు, డిటి కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, ప్రసాద్ నాయుడు, మాధవ నాయుడు, యుగంధర్, ఆనంద్, జనసేన నేత మెరుపుల మహేష్, బీజేపీ నేత హరిబాబు పాల్గొన్నారు.

సూపరసిక్స్ కరపత్రాల పంపిణీ

నగరి, ఏప్రిల్ 13: మండల పరిధిలోని ఓజీ కుప్పం పంచాయతీలో టీడీపీ నాయకులు ఇంటింట ప్రచారం చేస్తూ సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, పురుషోత్తం నాయుడు, సురేష్ నాయుడు, బాలాజీ వరదరాజులు, నారాయణస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: కొప్పేడు దళితవాడలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, తంగరాజ, సురేష్, సుందరం, జనసేన నేత శివలింగం, బీజేపీ నేతలు రమేష్, బాలకృష్ణ తదితరులు సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు.

విజయపురం: మహారాజపురంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, చుక్కా ధనుంజయ యాదవ్, బాబు యాదవ్, పురుషోత్తం, గుణమ్మ, డీఎస్‌రాజు, దశరధరాజు, బీజేపీ, జనసేన నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

చిత్తూరు నడివీధి గంగమ్మ జాతరకు అనుమతి లేదు

- కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 13: చిత్తూరులో మే నెల 14, 15 తేదీల్లో నడివీధి గంగమ్మ జాతర నిర్వహణకు ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని కలెక్టర్ షన్మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంగా వస్తున్న వదంతులను నమ్మొద్దంటూ కోరారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 13: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. టేకుమంద గ్రామానికి చెందిన అశోక్‌కుమార్, ప్రశాంత్‌లు సంతోష్ దాబా వద్ద శనివారం మద్యం అమ్ముతుండగా, వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద 27 ఆంధ్రాగోల్డ్ మద్యం సీసాలను స్వాధీన పరచుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఔను.. అక్కడ బైపీసీలో అందరూ ఫెయిలే!

వెదురుకుప్పం, ఏప్రిల్ 13: ఔను.. అక్కడ బైపీసీ గ్రూపులో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్ష రాసిన విద్యార్థులందరూ ఫెయిలయ్యారు. శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ విషయం వెల్లడైంది. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను వైసీపీ ప్రభుత్వ హయాంలో హైస్కూల్ ప్లస్ కాలేజీగా మార్చారు. కానీ, ఫలితాలు మాత్రం అక్కడ దారుణంగా ఉన్నాయి. పచ్చికాపల్లం హైస్కూల్ ప్లస్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీషు మీడియం కోర్సులు మాత్రమే ఉన్నాయి. మొదటి సంవత్సరం బైపీసీలో తొమ్మిది మంది ఉండగా, ఒకరు మాత్రమే పాసయ్యారు. ఎంపీసీలో ఉన్న ఒక్కరూ ఉత్తీర్ణులయ్యారు. రెండవ సంవత్సరం ఎంపీసీలో కూడా ఒక్కరే ఉండగా పాసయ్యారు. బైపీసీలో ముగ్గురు ఉండగా ముగ్గురూ ఫెయిలయ్యారు. దీంతో ద్వితీయ సంవత్సరం బైపీసీలో 'జీరో' ఫలితాలు వచ్చినట్లయింది. ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉండటం వల్ల ఫలితాలు తక్కువగా వచ్చాయని ఆ పాఠశాల హెచ్ఎం పోతగంటి సిద్ధయ్య శనివారం తెలిపారు. ప్రత్యేక తరగతుల నిర్వహణతో రానున్న సప్లిమెంటరీలో అందరూ ఉత్తీర్ణులయ్యే విధంగా తర్ఫీదును ఇస్తామన్నారు. అన్నీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారని వివరించారు.

కృత్రిమ మూత్రపిండాల తయారీ పరిశోధనకు అపోలో విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వైస్ ఛాన్సలర్ వినోద్ భట్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13: అమెరికాలోని బోస్టన్ బ్రిఘం హాస్పిటల్‌లో కృత్రిమ మూత్ర పిండాల తయారీ పరిశోధనలు చేసేందుకు చిత్తూరు అపోలో యూనివర్సిటీ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వినోద్ భట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఒక సంవత్సరం పాటు అక్కడ పరిశోధనలో పాల్గొంటారని వివరించారు. ఈ కృత్రిమ మేధస్సు ప్రయోగాలు వైద్య రంగానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వారికి అనుమతి పత్రాలు అందజేశారు. వీరిని అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి, ప్రొఫెసర్లు సత్యనారాయణ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఏర్పాటు



నియామక పత్రాలను చూపిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు, ఏప్రిల్ 13: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, ఐక్యవేదిక జిల్లా, డివిజన్, మండల స్థాయి నూతన కార్యవర్గాన్ని శనివారం ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి అధ్యక్షతన ఎన్నుకున్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా చిట్టిబాబు, డివిజన్ అధ్యక్షులుగా రాజాబాబు, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షులుగా కుమార్, నియోజకవర్గ ప్రధానకార్యదర్శిగా సురేంద్రబాబులను ఎన్నుకున్నారు. అదేవిధంగా చిత్తూరు మండల మహిళా అధ్యక్షురాలిగా మేరీ, మండల కన్వీనర్‌గా నాదముని, చిత్తూరు నగర మహిళా అధ్యక్షురాలిగా కోమలావతి, పెనుమూరు మండల అధ్యక్షురాలిగా రోజా, గుడిపాల మండల ప్రధాన కార్యదర్శిగా పట్టాభి, గుడిపాల మండల కోశాధికారి వినాయకం, గుడిపాల మండల కార్యనిర్వాహక సభ్యులుగా వినోద్‌కుమార్, రవికుమార్‌లను ఎన్నుకున్నారు.

టీడీపీ హయాంలోనే యువతకు ఉపాధి

పూతలపట్టు, ఏప్రిల్ 13: టీడీపీ హయాంలోనే యువతకు ఉపాధి ఉండేదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్రనేత యువరాజులు నాయుడు అన్నారు. శనివారం ఆయన మండలంలోని రంగాపురం, ఆకనంబట్టుతో పాటు పలు గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై యువతకు అవగాహన కల్పించారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మోహన్ నాయుడు, సునీల్ కుమార్, టి.పుత్తూరు సర్పంచ్ రవిచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మధుకుమార్, నాయకులు శరవణ, దాము, ప్రకాష్ నాయుడు, కోదండయ్య, చిట్టెమ్మ, షబ్బీర్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో అంబర మహారాజపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు రాజశేఖర్ నాయుడు, గుండయ్య, బాలాజీ నాయుడు, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల టీం సభ్యులు భాస్కర్ నాయుడు, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై గందరగోళం వద్దు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 13: పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై గందరగోళం అవసరంలేదని, జిల్లా ఎన్నికల అధికారి స్పష్టమైన వివరణ ఇచ్చేంతవరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరీక్షించాలని ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం పోస్టల్ బ్యాలెట్ అంశంపై ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గంటా మోహన్, గుణశేఖర్, సుబ్రహ్మణ్యం తదితరులు ఎన్నికల విభాగం అధికారులను కలిశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు తేదీపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు వాస్తవం కాదన్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి స్పష్టమైన ఆదేశాలు, సూచనలు జారీచేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల విభాగం వారు అందించిన సమాచారం మేరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం ప్రత్యేక కేంద్రాలను నిర్దేశిత తేదీల్లో ఏర్పాటు చేయనున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు ఉండవనే అభిప్రాయం కలుగుతుందన్నారు. ఎన్నికల విభాగం అధికారులను కల్సినవారిలో పలువురు ఎస్టీయూ నాయకులు ఉన్నారు.

దేవర ఎద్దు హఠాన్మరణం



దేవర ఎద్దు(ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, ఏప్రిల్ 13: కామసాని కులస్తులకు సంబంధించిన దేవర ఎద్దు శనివారం రాత్రి చనిపోయిందని ఆ కుల పెద్దలు తెలిపారు. వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ కొండారెడ్డివూరు కనుగొండరాయ స్వామి గుడి దగ్గర దేవర ఎద్దుకు అంత్యక్రియలను ఆదివారం మ ధ్యాహ్నం ఒంటి గంటకు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తు లు, కామసాని కులస్తులు హాజరు కావాలని కోరారు.

టీడీపీ, వైసీపీ గొడవపై నగరి డీఎస్పీ విచారణ

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 13: ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లి పంచాయతీలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య శుక్రవారం జరిగిన గొడవలపై ఆయా పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం నగరి డీఎస్పీ కె.ఎస్. మూర్తి 49.కొత్తపల్లి, మిట్ట గ్రామాల్లో విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు శాంతియుతంగా ఉండాలని అన్నారు. కార్వేటి నగరం సీఐ సత్యబాబు, ఎస్ఐ కుళాయిప్ప, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.